క్లుప్తంగా

ప్రీప్రైమరీలో ఉద్యోగ అవకాశాలు

నర్సాపూర్: నర్సాపూర్‌లోని మండల ప్రాథమిక పాఠశాల–2 లో ప్రీ ప్రైమరీ స్కూల్ మంజూరైందని ఎంఈఓ తారాసింగ్ తెలిపారు. అందులో పనిచేసేందుకు ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులు మంజూరు అయ్యాయని, తాత్కాలిక పద్ధతిన నియమిస్తారని చెప్పారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని సంప్రదించాలని ఆయన సూచించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని సామ్లా తండాలో మంగళవారం ప్రధానమంత్రి ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని నిర్వహించామని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ సతీశ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం సురక్ష భీమా యోజన, జీవన్‌జ్యోతి యోజన, అటల్ పెన్షన్ యోజన, ఇతర బీమా పథకాలపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, మాజీ సర్పంచ్ భిక్షపతి, సిబ్బంది బషీర్, మోహన్, బ్యాంక్ మిత్ర బీరప్ప పాల్గొన్నారు.

సిమెంట్ రంగంలో రారాజు 'భారతి'

బ్రాంచ్ మేనేజర్ నాగేశ్వర్‌రావు



బీమా పత్రాలు అందజేస్తున్న నాగేశ్వర్‌రావు

మెదక్ కలెక్టరేట్: సిమెంట్ రంగంలో భారతి సిమెంట్ రారాజుగా నిలుస్తుందని, వినియోగదారులకు సంస్థ ఆధ్వర్యంలో ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తున్నట్లు బ్రాంచ్ మేనేజర్ నాగేశ్వర్‌రావు తెలిపారు. మెదక్‌లో మంగళవారం తాపీమేస్త్రీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న వికాట్ గ్రూపునకు చెందిన భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను తెలంగాణలో విడుదల చేసిందన్నారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందని చెప్పారు. ఇంటి నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. మేస్త్రీలకు లక్ష రూపాయల ప్రమాద బీమా పత్రాలు అందజేశారు. భారతి సిమెంట్ కంపెనీ టెక్నికల్ మేనేజర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్

కౌడిపల్లి(నర్సాపూర్): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పాలని బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్ అన్నారు. మంగళవారం బీజేపీ మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కౌడిపల్లిలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాకేశ్, నాయకులు శేఖులు, కుమార్, గోపాల్, సురేశ్, మధు, కృష్ణ, ఆంజనేయులు, నాగరాజు, రమేశ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందించిన బీజేపీ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందిన బొండ్ల రాములుకు రూ.17,500 సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శిర్న చంద్రశేఖర్ అందించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ... సీఎంఆర్ ఎఫ్ చెక్కు మంజూరుకు సహకరించిన ఎంపీ రఘునందన్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

కష్టపడి చదివితే ఉన్నత స్థానాలు

లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ విజయలక్ష్మి



మాట్లాడుతున్న విజయలక్ష్మి

రామాయంపేట(మెదక్): విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత స్థానాలకు సాధించవచ్చని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ విజయలక్ష్మి సూచించారు. ప్రముఖ డాక్టర్ టీవీపీ చారి స్థానిక డిగ్రీ కళాశాలలో మంగళవారం డెస్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాలలకు అవసరమైన కంప్యూటర్లు, వాటర్ ప్యూరిఫైయర్లు అందించడానికి కృషి చేస్తామన్నారు. ప్రిన్సిపాల్ హుస్సేన్ మాట్లాడుతూ దాతలు సహకరించాలన్నారు. టీవీపీ చారి, సంజయ్ గుప్తా, మల్లేశ్, యాదగిరి, రాజశేఖర్‌రెడ్డి, కైలాస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీ.. నిర్వహణ మేటి



జిల్లాస్థాయి పోటీల్లో ఆసనాలు వేస్తున్న క్రీడాకారులు

- జిల్లాస్థాయి యోగా పోటీలకు వేదికగా 'చేగుంట'
- వరుసగా ఆరుసార్లు ఆతిథ్యం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంట యోగా పోటీలకు వేదికగా మారింది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఇక్కడ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2020లో జిల్లాస్థాయి యోగా పోటీలను ప్రారంభించారు. నాటి నుంచి వరుసగా ఆరుసార్లు విజయవంతంగా పోటీలను నిర్వహించారు. మొదటిసారి ప్రారంభించిన పోటీల్లో కేవలం వందలోపు క్రీడాకారులే పాల్గొనగా, గత శనివారం నిర్వహించిన 6వ జిల్లా స్థాయి యోగా పోటీల్లో 280 మంది క్రీడాకారులు పాల్గొనడం విశేషం.

రవాణాకు అనుకూలం

జిల్లాలో చేగుంటకు రవాణాకు సౌకర్యాలు అనుకూలంగా ఉన్నాయి. అన్ని మండలాల క్రీడాకారులు సకాలంలో ఇక్కడికి చేరుకునే వీలు ఉండటంతో పోటీలను వరుసగా నిర్వహించే అవకాశం ఏర్పడింది. శనివారం నిర్వహించిన ఆరో జిల్లా స్థాయి యోగా పోటీల్లో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, నిజామాబాద్, సిద్దిపేట, మెదక్ జిల్లాలకు చెందిన 20 మంది రెఫరీలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించగా, జిల్లాలోని పలు మండలాల పీడీ, పీఈటీలు యోగా పోటీలకు సహకారం అందించారు. జిల్లా స్థాయి పోటీల నిర్వహణ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని రాబోయే రోజుల్లో రాష్ట్ర స్థాయి యోగా పోటీలను చేగుంటలో నిర్వహించి గ్రామానికి గుర్తింపు తేవాలని క్రీడాభిమానులు కోరుతున్నారు.

యోగా సాధన చేయాలి



ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలి. ప్రస్తుతం సబ్ జూనియర్ నుంచి సీనియర్ వరకు పది కేటగిరీలలో యోగా పోటీలు జరుగుతున్నాయి. యోగా సాధన చేసిన వారంతా పలు పోటీల్లో పాల్గొనవచ్చు. జీవన మంత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలను సైతం నిర్వహిస్తున్నాం.

– నరేశ్, జీవనమంత్ర యోగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు

అవకాశం వస్తే రాష్ట్రస్థాయి పోటీలు



వరుసగా 6 జిల్లా స్థాయి పోటీలను చేగుంట కేంద్రంగా విజయవంతంగా నిర్వహించాం. అవకాశం వస్తే రాబోయే రోజుల్లో రాష్ట్రస్థాయి పోటీలను సైతం నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం. పోటీల నిర్వహణకు స్థానిక నాయకులు, యువకులు, క్రీడాభిమానులు తమవంతు సహకారాలు అందిస్తున్నారు.

– గణేశ్ రవికుమార్, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు



ఆలయంలో పూజలు చేస్తున్న గ్రామస్తులు

వర్షాల కోసం పూజలు

కౌడిపల్లి(నర్సాపూర్): వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలతో ప్రజలు సంతోషంగా ఉండాలని తిమ్మాపూర్‌లో గ్రామస్తులు మంగళవారం ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పురోహితుడు మనోజ్‌శర్మ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి చందన అలంకరణ చేశారు. గణపతి పూజ, హోమం, సత్యనారాయణ స్వామి వ్రతం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పద్మకిష్టయ్య, మాజీ ఎంపీటీసీ సార శంకర్‌గౌడ్, శంకర్, నర్సింలు, సంతోష్‌గౌడ్, మొగులాగౌడ్, రమేశ్ గౌడ్, బాలరాజు, సత్యనారాయణ, శ్రీకాంత్, బైరవ్, లచ్చగౌడ్, సాయాగౌడ్ పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

రేగోడ్(మెదక్): మండలంలోని పోచారం గ్రామ శివారులో మంగళవారం స్థానిక ఏఓ జావీద్ రైతు పొలంలో రైతు, కూలీలతో కలిసి వరినాట్లు వేశారు. అనంతరం వరిపంట సాగుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వరిలో భాస్వరాన్ని కరగదీసే బాక్టీరియా గురించి పలు సూచనలు చేశారు. వరి నాటుకునే సమయంలో వరి నారు వేర్లను నీటితో కలిపిన భాస్వరం కరిగించే బాక్టీరియా(పీఎస్‌బీ) ద్రావణంలో 15 నుంచి 30 నిముషాలు ఉంచి నాటుకోవాలని తెలిపారు. వరి నాటే సమయంలో 2 మీటర్లకు 30 సెంటీమీటర్ల కాలి బాటలు వదలడం వలన గాలి వెలుతురు బాగా అంది ఎక్కువ పిలకలు వస్తాయన్నారు. వరి నారు యొక్క కొనలు తుంచి నాటుకోవడం ద్వారా పురుగు ఉధృతి తగ్గి మంచి దిగుబడులు సాధించవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ మహేశ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలోనే నిర్వహించాలి

హవేళిఘణాపూర్(మెదక్): ప్రభుత్వం చేపడుతున్న పీఎంశ్రీ, ప్రీప్రైమరీ విద్యను ఐసీడీఎస్ అంగన్‌వాడీ ఆధ్వర్యంలో నిర్వహించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సీఐటీయూ నాయకులు మల్లేశం ఆధ్వర్యంలో తహసీల్దార్ సింధూరేణుకకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మల్లేశం మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న ప్రీప్రైమరీ, పీఎంశ్రీని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల కొనసాగింపులో కీలక పాత్ర పోషిస్తున్న వారి శ్రమను గుర్తించి అంగన్‌వాడీల్లోనే వీటిని కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ప్రభుత్వ పాఠశాల్లో ఈ పథకాల వల్ల విద్యార్థుల సంఖ్య తగ్గి అంగన్‌వాడీల్లో ఉపాధి అవకాశాలు కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.



అంగన్‌వాడీని పరిశీలిస్తున్న వైద్యాధికారులు

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లిలోని నాల్గవ అంగన్‌వాడీ కేంద్రాన్ని మండల వైద్యాధికారి శ్రీకాంత్, డాక్టర్ ఫెర్నాజ్ మంగళవారం పరిశీలించారు. కేంద్రంలోని పిల్లలు, గర్భిణులు, తల్లులకు పంపిణీ చేస్తున్న పోషకాహారం, పాలు, గుడ్లు ఇతర వివరాలు తెలుసుకున్నారు. పిల్లల ఆరోగ్యం, పరిశుభ్రత తదితర విషయాలు అంగన్‌వాడీ టీచర్ రజియాసుల్తానను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎలిజబెత్‌రాణి, వైద్యసిబ్బంది ఉన్నారు.

తెగిపడిన విద్యుత్ వైర్లు.... తప్పిన ప్రమాదం



తెగిపడిన విద్యుత్ వైర్లు

శివ్వంపేట(నర్సాపూర్): విద్యుత్ వైర్లు తెగిపడిన సంఘటన మండల పరిధి గంగాయిపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామంలోని ప్రధాన వీధిలో ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ వైరు తెగి పడింది. ఆ సమయంలో ప్రజలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఓ ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించి అధిక లోడ్ మూలంగా తరుచూ విద్యుత్ వైర్లు తెగిపడుతున్నప్పటికీ విద్యుత్ సిబ్బంది చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ వైర్లను సరిచేయాల్సిన అవసరం ఉంది. ఈ విషయం గురించి స్థానిక లైన్‌మెన్ భాగ్యరాజ్ దృష్టికి తీసుకెళ్లగా రెండు స్తంభాలు, వైరు అవసరం ఉందని ఈ విషయం ఉన్నతధికారులకు నివేదించనున్నట్లు చెప్పారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

పెద్దశంకరంపేట(మెదక్): ఆయిల్‌పామ్ పంటల సాగుతో రైతులకు అధికలాభాలు వస్తాయని ఇన్‌చార్జి ఏఓ కృష్ణ పేర్కొన్నారు. పెద్దశంకరంపేట, కట్టెల వెంకటాపూర్, ఉత్తులూర్ శివారులో ఆయిల్‌పామ్ మొక్కలను నాటేందుకు రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. 90% రాయితీపై మొక్కలు అందజేస్తామని, దీంతోపాటు డ్రిప్ సౌకర్యం కూడా ఉంటుందని ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు మమత, అఖిల్, వినీత్, లీఫ్‌పామ్ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ జాన్సన్ పాల్గొన్నారు.



పెద్దశంకరంపేటలో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు

మండల ప్రత్యేకాధికారి నిత్యానంద్

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామాల్లో సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా నిల్వనీరు లేకుండా చూడాలని, ప్రతి రోజు డ్రైడే కార్యక్రమాలు నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి నిత్యానంద్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం ఆయన మండల ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యాచరణపై పలు సూచనలిచ్చారు. గ్రామాల్లో మురుగునీటిని తొలగించి బ్లీచింగ్, మురికిగుంటల్లో ఆయిల్‌బాల్స్, దోమలు రాకుండా ప్రతిరోజు సాయంత్రం ఫాగింగ్ చేయించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని తెలిపారు. రోడ్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తకుప్పలు డంపింగ్‌యార్డులకు తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రశాంత్, ఇన్‌చార్జి ఎంపీఓ తిరుపతి ఉన్నారు.



చండూర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న నిత్యానంద్

పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు రావు

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా పౌరసరఫరాల, మండల ప్రత్యేకాధికారి నిత్యానంద్ అన్నారు. మంగళవారం ఆయన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా చిలప్‌చెడ్, చండూర్ గ్రామాలను సందర్శించి, పంచాయతీ రికార్డులు, శానిటేషన్, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించడంతో పాటు, పలు చోట్ల నిల్వ నీటిని తొలగింపజేశారు. ఇన్‌చార్జి ఎంపీఓ తిరుపతి, పంచాయతీ కార్యదర్శి జితేందర్ పాల్గొన్నారు.

మరమ్మతుల మాయాజాలం

తరచూ పాడైపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లు

- వేల రూపాయలు ఖర్చులు వృథా
- నాలుగు వందల మంది వినియోగదారులకు ఇక్కట్లు

రేగోడ్(మెదక్): ప్రజాసంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉచిత కరెంట్‌ను అమలు చేస్తోంది. ప్రజలు ఉచిత విద్యుత్‌ను వినియోగించుకుంటూ.. చెల్లించే బిల్లులను ఆదా చేసుకుంటున్నారు. ఇదంతా బాగానే ఉన్నా విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఫలితంగా సుమారు నాలుగు వందల మంది వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. అయినా పట్టించుకునే వారే కరువయ్యారని ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. మెదక్ జిల్లా రేగోడ్ మండలంలో 18 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మంత్రి దామోదర మండలంపై ప్రత్యేక దృష్టి పెడుతూ నిధులు మంజూరు చేస్తున్నా జిల్లా అధికారులు మాత్రం మండలంపై చిన్నచూపు చూస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. రేగోడ్‌లో ప్రభుత్వ ఆస్పత్రి, బసవేశ్వర విగ్రహం వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు రెండూ తరచూ చెడిపోతున్నాయి. ఎన్నిసార్లు మరమ్మతులు చేసినా.. వారం రోజుల లోపే మళ్లీ చెడిపోతుండటం గమనార్హం. మూడు.. ఆరు నెలల్లో పలుమార్లు చెడిపోతుండటంతో అధికారులు సైతం అవస్థలు పడుతున్నారు. ప్రజలు అడిగే ప్రశ్నలకు ఏం చెప్పలేక పైఅధికారులకు విన్నవించలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ రెండు ట్రాన్స్‌ఫార్మర్ల కింద ఉన్న సుమారు 4 వందల కనెక్షన్‌దారులు రాత్రిల్లో చీకట్లో ఉండాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో దోమలు సైరవిహారం చేస్తూ కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని వాపోయారు. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల్లో నాణ్యత లోపించే తరచూ చెడిపోతున్నాయా అని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వేలకు వేలు ఖర్చు..

వేలకు వేలు ఖర్చు చేసినా ట్రాన్స్‌ఫార్మర్‌లు సక్రమంగా పని చేయకపోవడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. నూతన ట్రాన్స్‌ఫార్మర్‌లను పంపించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ స్పందించి రెండు కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతులకు తరలిస్తున్న గ్రామస్తులు

సమస్యను పరిష్కరిస్తా..

రేగోడ్‌లో రెండు ట్రాన్స్‌ఫార్మర్‌లతో తరచూ నెలకొంటున్న విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాను. మా సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకుంటా.

– నారాయణ, ట్రాన్స్‌కో ఎస్‌ఈ

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్



అవంచలో ఇంటింటి ప్రచారం

నర్సాపూర్‌రూరల్/ కొల్చారం(నర్సాపూర్): స్థానిక సంస్థ ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి బీజేపీ సత్తా చాటాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వల్దాస్ మల్లేశ్‌గౌడ్ కార్యకర్తలు, అభిమానులకు పిలుపునిచ్చారు. నర్సాపూర్‌రూరల్ మండలంలోని అవంచలోను కొల్చారం మండలంలోని వరిగుంతం గ్రామంలోను మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఇంటింటా తిరిగి కేంద్ర ప్రభుత పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమాలలో జిల్లా ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి రాములు నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు నగేష్, బీజేవైఎమ్ మండల అధ్యక్షుడు రాజేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కౌడిపల్లి, ముట్రాజ్‌పల్లి, పీర్యతండా పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులకు ఎంపిక అయ్యాయని, వీటిలో ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ బాలరాజు తెలిపారు. ఈ మూడు పాఠశాలలో ఇన్‌స్ట్రక్టర్‌కు ఇంటర్మీడియట్, ఆయాకు ఏడవ తరగతి చదివిన వారు అర్హులన్నారు. ఎంపిక అయిన ఇన్‌స్ట్రక్టర్‌కు నెలకు రూ. 8 వేలు, ఆయాకు రూ. 6 వేలు వేతనం ఉంటుందన్నారు. వివరాలకు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలను సంప్రదించాలన్నారు.

పాఠశాల తనిఖీ

మండలంలోని కొర్రసీత్యతండా, వెల్మకన్న ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ బాలరాజు, ఎఫ్‌ఎల్‌ఎన్ జిల్లా ప్రతినిధి ఆదిత్య తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులు పరిశీలించడంతో పాటు విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు.

గ్రామాల్లో జ్వర సర్వే

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాలలో వైద్యసిబ్బంది జ్వర సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైన కౌడిపల్లిలో ఏఎన్‌ఎంలు శ్రీధర్‌రెడ్డి, శోభారాణి వైద్యసిబ్బంది ఇంటింటికీ తిరిగి గ్రామస్తుల ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనారోగ్య సమస్యలుంటే వైద్యులను సంప్రదించాలని చెప్పారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన

చేగుంట(తూప్రాన్): ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు త్వరగా నిర్మించుకోవాలని మండల ప్రత్యేక అధికారి హైమావతి సూచించారు. మండలంలోని గొల్లపల్లి, రాంపూర్ గ్రామాలను మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి మాట్లాడారు. అనంతరం గ్రామాల్లోని పారిశుద్ధ్యం, వీధుల శుభ్రతను పరిశీలించి పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు.



ఇంటి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న హైమావతి

మహిళలకు రాయితీ రుణాలు

- ఇప్పటికే జిల్లాలో 7,668 సంఘాలకు వడ్డీలేని రుణాలు
- ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి సంస్థల కింద 150 సంఘాలకు రాయితీ రుణాలు

చిన్నశంకరంపేట(మెదక్): మహిళా సాధికారత సాధించేలా వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. చిన్నశంకరంపేట మండల కేంద్రంతో పాటు గవ్వలపల్లిలోని మహిళ సమైక్యా సంఘాల ద్వారా రుణం పొంది వ్యాపారం చేస్తున్న మహిళల దుకాణాలను మంగళవారం పరిశీలించారు. అనంతరం వారితో మాట్లాడి ఆర్థికాభివృద్ధిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మహిళలు తమకాళ్లపై తాము నిలబడి వ్యాపారులుగా ఎదిగేందుకు ప్రభుత్వం చేయూతనిస్తుందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 7,668 మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలను అందించినట్లు తెలిపారు. అలాగే ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి సంస్థల క్రమబద్ధీకరణ పథకం ద్వారా 150 మహిళా సమైక్య సంఘాలకు రుణాలను అందించినట్లు తెలిపారు. అనంతరం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని వెటర్నరీ ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేసి పశువుల వైద్యం కోసం అందుబాటులో ఉన్న మందుల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీఏ ఏపీడీ సరస్వతి, డీజీఎం యాదగిరి, ఏపీఎం రాములు, సీసీలు యశోద, రాజు ఉన్నారు.

'ఇచ్చిన హామీలు అమలు చేయాలి'

శివ్వంపేట(నర్సాపూర్): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలు అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి బొజ్జ సైదులు డిమాండ్ చేశారు. ఈ నెల 13న మెదక్‌లో నిర్వహించతలపెట్టిన దివ్యాంగుల మహాగర్జనకు సంబంధించి మంగళవారం మండల కేంద్రమైన శివ్వంపేటలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆసరా, దివ్యాంగులకు, పింఛన్‌దారులకు పెన్షన్ పెంచుతామని చెప్పి నేటికీ పెంచలేదన్నారు. పింఛను పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 13న మెదక్‌లో తలపెట్టిన మహాగర్జనకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ హాజరవుతున్నారన్నారు.